తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-25- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 29 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# బాలకార్మికుల రక్షణలో తెలంగాణదే అగ్రస్థానం

## 2024-25లో 11,063 మంది బాలల రక్షణ

- చెత్త పనుల్లో 90% పిల్లలు.. ఆందోళనకరమైన నివేదిక
- అరెస్టులు మరియు చట్టపరమైన చర్యలు.. తెలంగాణలోనే అత్యధికం
- జాతీయ మిషన్‌కు అవసరం.. నివేదిక సిఫార్సులు
- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు విద్య, పునరావాసం కీలకం
- నేరస్థులపై కఠిన చర్యలే పరిష్కారం
- జీరో టాలరెన్స్ విధానం, బడి మానిన పిల్లలపై ప్రత్యేక దృష్టి
- ఐఎల్ఓ కన్వెన్షన్ 182 పై భారత పాత్ర
- సమగ్ర పునరావాస విధానం అవసరం.. జేఆర్సీ కన్వీనర్ అభిప్రాయం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

202425లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్సీ) 38,388 రెస్క్యూ ఆపరేషన్ల ద్వారా మొత్తం 53,651 మంది పిల్లల ను రక్షించగా, తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢల్లీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జేఆర్సీ అనేది 250కి పైగా ఎన్జీవోల నెట్వర్క్, బాలల రక్షణ కోసం పనిచేస్తున్న దేశంలోనే అతిపెద్ద నెట్వర్క్ ఇది. జేఆర్సీ పార్టనర్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ విడుదల చేసిన నివేదిక లో బాలకార్మిక వ్యవస్థను అంతమొందించేందుకు జాతీయ మిషన్, రక్షించిన పిల్లల కోసం పునరావాస నిధిని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. బాలకార్మికులు, అక్రమరవాణా నెట్ వర్క్ లపై ఉక్కుపాదం మోపడం తెలంగాణ 202425లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 250కి పైగా స్వచ్ఛంద సంస్థల నెట్వర్క్ ద్వారా 53,651 మంది చిన్నారులను రక్షించగా, ఒక్క తెలంగాణలోనే 11,063 మంది ఉన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్సీ) అనే నెట్వర్క్ 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించిన 38,388 చర్యల్లో 7,632 సహాయక చర్యలకు నాయకత్వం వహించింది. చట్టాన్ని అమలు చేసే సంస్థల సమన్వయంతో జేఆర్సీ పార్టనర్ లు ఈ ఆపరేషన్లు నిర్వహించారు. తాజాగా విడుదల చేసిన ఒక రిపోర్ట్ మరింత ఆందోళనకరమైన ధోరణులను వెల్లడిస్తుంది: భారతదేశం అంతటా రక్షించబడిన పిల్లలలో దాదాపు 90% మంది స్పాలు, మసాజ్ పార్లర్లు మరియు ఆర్కెస్ట్రాలతో సహా బాల కార్మికుల ఉపయోగించిన చెత్త పనులుగా వర్గీకరించబడిన రంగాలలో పనిచేస్తున్నట్లు కనుగొనబడిరది, ఇక్కడ పిల్లలు వ్యభిచారం, అశ్లీలత మరియు ఇతర రకాల లైంగిక దోపిడీకి గురవుతున్నారు. జేఆర్సీ పార్టనర్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ రీసెర్చ్ విభాగమైన సెంటర్ ఫర్ లీగల్ యాక్షన్ అండ్ బిహేవియర్ ఛేంజ్ (సీల్యాబ్) ప్రచురించిన 'బిల్డింగ్ ది కేస్ ఫర్ జీరో: ప్రాసిక్యూషన్ బాలకార్మిక వ్యవస్థను అంతమొందించడానికి టిప్పింగ్ పాయింట్ గా ఎలా పనిచేస్తుంది' అనే రిపోర్ట్ లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

మిగతా 2లో..




# కష్టపడి పనిచేస్తేనే పదవులు వస్తాయి


- కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు
- రాబోయే రోజుల్లో అనేక సవాళ్లున్నాయి
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటివి రానున్నాయని ప్రస్తావన
- త్వరలో మార్కెట్, దేవాలయ కమిటీల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

# ఈటల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్ అధికారులు

- ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్..
- బీఆర్ఎస్‌పై ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్
- ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ : సిట్

2లో..



# 4రోజులు వానలే

## కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ను జారీ చేసింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షాలు పడుతాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్య, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడుతాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్ల రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. కుమ్రంభీం జిల్లాలో వానలు దంచికొట్టాయి. అత్యధికంగా దహెగాంలో 6.9 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

# ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి?

- కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా?
- రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా?
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు 15,000 చొప్పున ఇస్తామని చెప్పి 12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని ధ్వజమెత్తారు.

మిగతా 2లో..



# గత ఏడాది తప్పులు పునరావృతం కావొద్దు

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఏర్పాట్లపై పొన్నం సమీక్ష
- రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని విన్నపం
- అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, స్థానికులు, భక్తుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన నొక్కిచెప్పారు. జూలై 13, 14 తేదీలలో జరగనున్న ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉదయం దేవాలయ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో..

# కన్న తల్లి అని చూడకుండా హత్య చేయించిన కూతురు

- జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. కసాయి కూతురు కన్న తల్లి అని చూడకుండా ప్రియుడితో కలిసి హత్య చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎల్బీనగర్‌లో నివాసముండే బాలిక తన ప్రియుడితో కలిసి తల్లి గొంతు నులిమి, తలపై కొట్టి హత్య చేసింది.

మిగతా 2లో..





# వాదనలు పూర్తి, తీర్పు రిజర్వ్

- 2021 నాటి కేసు కొట్టివేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభ్యర్థన
- చౌటుప్పల్ పీఎస్‌లో నమోదైన కేసుపై హైకోర్టులో విచారణ పూర్తి

2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బాలకార్మికుల రక్షణలో తెలంగాణదే అగ్రస్థానం



(మొదటి పేజీ తరువాయి)

దాడుల అనంతరం 38,388 ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, 5,809 మందిని అరెస్టు చేశామని, వీటిలో 85 శాతం బాలకార్మిక వ్యవస్థకు సంబంధించినవేనని నివేదిక పేర్కొంది. అత్యధికంగా జరిగిన దాడుల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవగా, ఉత్తరప్రదేశ్ (2,469), రాజస్థాన్ (2,453), మధ్యప్రదేశ్ (2,335) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

సహాయక చర్యల్లో తెలంగాణ 11,063 మంది, బీహార్ 3,974, రాజస్థాన్ 3,847, ఉత్తరప్రదేశ్ 3,804, ఢల్లీ 2,588 మంది చిన్నారులను రక్షించాయి.మొత్తం 5,809 మందిని అరెస్టు చేయగా, వారిలో 85 శాతం మంది బాలకార్మిక సంబంధిత కేసుల్లో ఉన్నారు. తెలంగాణ, బీహార్, రాజస్థాన్ లో అత్యధిక అరెస్టులు నమోదయ్యాయని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రెస్క్యూ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ అరెస్టులు జరిగాయని నివేదిక తెలిపింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా బాలకార్మిక వ్యవస్థను అంతమొందించేందుకు జాతీయ మిషన్ ను ప్రారంభించాలని, దానికి తగిన వనరులను కేటాయించాలని, జిల్లా స్థాయి బాలకార్మిక టాస్క్ ఫోర్స్ లను ఏర్పాటు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది.బాలల రక్షణ కోసం పనిచేస్తున్న దేశంలోని అతిపెద్ద ఎన్జీవో నెట్వర్క్ నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్ల డేటా ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఉంది.బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టపరమైన చర్యలు, విద్య, పునరావాసం వంటి అంశాలను ఈ నివేదిక నొక్కిచెప్పి పలు సిఫార్సులు చేసింది. నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోకపోతే బాలకార్మిక వ్యవస్థను అరికట్టడం కష్టమవుతుందని నివేదిక పేర్కొంది. అంతేకాక రక్షించబడిన పిల్లల విద్య మరియు పునరావాసానికి ఏర్పాట్లు చేయకపోతే, వారు తిరిగి బాలకార్మికుల విషవలయంలో పడిపోతారు.అందువల్ల బాలకార్మిక పునరావాస నిధి అవసరం.

అలాగే, 18 సంవత్సరాల వరకు ఉచిత మరియు నిర్బంధ విద్యను నిర్ధారించడం బాలకార్మిక వ్యవస్థను నివారించడంలో సహాయపడుతుందని, బడి మానేసిన పిల్లలు దోపిడీ కార్మికులలో చిక్కుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.సమగ్ర విధాన మార్పులు, ప్రభుత్వ సేకరణలో బాలకార్మికుల వినియోగంపై జీరో టాలరెన్స్ విధానం, ప్రమాదకర పరిశ్రమల జాబితా విస్తరణ, రాష్ట్ర నిర్దిష్ట బాలకార్మిక విధానాలు, ఎస్ డి జి 8.7 గడువును 2030 వరకు పొడిగించడం, నేరస్థులపై కఠినమైన, కాలపరిమితితో కూడిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నివేదిక పిలుపునిచ్చింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు భారత ప్రభుత్వం గుర్తించిన విధంగా బాలకార్మిక వ్యవస్థ యొక్క అత్యంత చెత్త పనుల్లో పిల్లలను నిమగ్నం చేయడంపై ఆందోళన వ్యక్తం చేసిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ నేషనల్ కన్వీనర్ రవి కాంత్ మాట్లాడుతూ, ''ఇంత పెద్ద సంఖ్యలో పిల్లలు బాలకార్మిక వ్యవస్థ యొక్క అత్యంత దారుణమైన పనుల్లో నిమగ్నమయ్యారు, ప్రభుత్వం మరియు పౌర సమాజం కృషి చేసినప్పటికీ, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న మా జాతీయ సంకల్పం అసంపూర్తిగా మిగిలిపోయింది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుబడి ఉన్న ఐఎల్ వో కన్వెన్షన్ 182పై భారత్ సంతకం చేసింది. ఈ దిశగా భారత్ చిత్త శుద్ధితో ప్రయత్నాలు చేస్తోందని, ప్రోత్సాహకర ఫలితాలు వస్తున్నాయన్నారు.

ఇంకా ఆయన మాట్లాడుతూ ''చట్టపరమైన చర్యలు ప్రజల మనస్సులో చట్టం పట్ల భయాన్ని సృష్టిస్తాయని, ఇది బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఈ నివేదిక రుజువు చేస్తుందని ఆయన అన్నారు. బాలకార్మికుల్లో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో చిక్కుకున్న చిన్నారులకు న్యాయం జరుగుతుందని, దోషులను శిక్షించి, బాధితుల రక్షణ, పునరావాసం కోసం పటిష్టమైన యంత్రాంగాలను ఏర్పాటు చేసినప్పుడే సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వం ప్రాసిక్యూషన్ వ్యవస్థను బలోపేతం చేయాలి, బాలకార్మిక పునరావాస నిధిని ఏర్పాటు చేయాలి మరియు ఈ పిల్లలు స్వయం సమృద్ధి సాధించడానికి సమగ్ర పునరావాస విధానాన్ని రూపొందించాలి'' అన్నారు.




# కష్టపడి పనిచేస్తేనే పదవులు వస్తాయి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్నందున వాటిని అధిగమించేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి కీలక పరిణామాలు భవిష్యత్తులో చోటుచేసుకోనున్నాయని ఆయన పార్టీ నేతలకు వివరించారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. త్వరలోనే మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

అదేవిధంగా, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలని ఆయన సూచించారు.నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని పార్టీ నాయకులు ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు. అవసరమైతే తాను కూడా గ్రామాల్లో పర్యటించేందుకు సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య పూర్తి సమన్వయంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికే సముచిత స్థానం లభిస్తుందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. ''మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా పనిచేయాలి. ఇందుకోసం బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయి వరకు పార్టీ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీల్లోని నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాల్సిందే. పనితీరు కనబరిస్తేనే పదవులు దక్కుతాయి. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అండగా నిలిచి, కష్టపడి పనిచేసిన వారికి ఇప్పటికే పదవులు ఇచ్చాం, భవిష్యత్తులో కూడా ప్రాధాన్యత ఉంటుంది'' అని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఈటల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్ అధికారులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)




ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను మంగళవారం సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్ మెంట్ ను సిట్ అధికారులు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి బాధితుడిని తనేనంటూ ఈటల ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, డ్రైవర్లు, గన్‌మెన్‌లు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపణలు చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికతో పాటు అంతకుముందు, తర్వాత కూడా ఫోన్ ట్యాపింగ్‌కి గురైనట్లు సిట్ గుర్తించింది. అలాగే.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సిట్ అధికారులకి ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2024 వరకు తన ఫోన్ సంభాషణలను రహస్యంగా తెలుసుకున్నారని ఫిర్యాదులో మాధవరం కృష్ణారావు తెలిపారు. కుట్ర పూరితంగా కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేసినట్లు సిట్‌కి తెలంగాణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెజండ్ల కిషోర్ బాబు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను సిట్ అధికారులకి కిషోర్ బాబు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారులందరూ కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నిబంధనలు అతిక్రమించి కేసీఆర్ కోసం పనిచేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోని ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ హక్కును ఆటంకం కలిగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. సంఘవిద్రోహ శక్తులవి కాకుండా నాయకులు ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాపింగ్ చేయడం దారుణమని ధ్వజమెత్తారు ఈటల రాజేందర్.

# గత ఏడాది తప్పులు పునరావృతం కావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా, ఆయా శాఖలు చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారికి ఆతిథ్యం ఇవ్వడంలో నగర ప్రజలు ఎప్పుడూ ముందుంటారని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని మంత్రి కోరారు. ముఖ్యంగా దేవాలయం లోపల, వెలుపల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. గోల్కొండ, బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, లాల్ దర్వాజ బోనాలతో పాటు నగరంలోని సుమారు 3000 దేవాలయాల వద్ద జాతరలను విజ



యవంతం చేసేందుకు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర జరిగే ప్రాంతాల్లో అదనపు మంచినీటి సరఫరా చేయాలని జల మండలి అధికారులకు సూచించారు.ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో, తలపై బోనాలతో అమ్మవారి దర్శనానికి వచ్చే మహిళా భక్తులకు ప్రాధాన్యతనిచ్చి, వారు త్వరగా దర్శనం చేసుకునేలా చూడాలని, వీఐపీలు సైతం ఇందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఎదురైన చిన్న చిన్న సమస్యలను సమీక్షించుకొని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, దేవాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో పూర్తిగా సీసీ రోడ్లు, అవసరమైన చోట్ల బీటీ రోడ్లు నిర్మించాలని కోరారు. గతంలో ఇక్కడ పనిచేసి, అనుభవం ఉన్న పోలీస్ ఇన్ స్పెక్టర్లను నియమిస్తే బందోబస్తు ఏర్పాట్లు మరింత సమర్థవంతంగా ఉంటాయని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ హరిచందన, జాయింట్ కమిషనర్ విక్రం సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్, డీసీపీ రష్మి పెరుమాళ్, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కన్న తల్లి అని చూడకుండా హత్య చేయించిన కూతురు

(మొదటి పేజీ తరువాయి)



తన ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి తల్లి మందలించిందనే కోపంతో ఈ దారుణానికి పాల్పడిరది. తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి హత్యకు పాల్పడిరది. కాగా బాలిక పదవ తరగతి చదువుతోంది. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యకు పాల్పడిన అందరూ మైనర్లే కావడం గమనార్హం. ఈనెల 19న ఇంట్లో నుంచి బాలిక తన ప్రియుడితో వెళ్లిపోయింది. దీంతో తన కూతురు కనిపించకపోవడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ప్రియుడు బాలికను తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో తమ ప్రేమకు అడ్డు వస్తున్న తల్లిని చంపేయాలని కుమార్తె నిర్ణయించుకుంది. ప్రియుడు, అతని సోదరుడి సహాయంతో బాలిక తన తల్లిని హత్య చేసింది. కాగా ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. తల్లి పూజ చేసుకుంటున్న సమయంలో కుమార్తె ప్రియుడు ఆమె మెడకు చున్నీ బిగించాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయిందని అనుకున్నారు. అదే సమయంలో ట్యూషన్ నుంచి మృతురాలి చిన్న కూతురు ఇంటికి వచ్చింది. అమ్మ పూజ చేస్తూ కింద పడిపోయిందని నమ్మించారు. మాయమాటలు చెప్పి ఆమెను బయటకు పంపి మరోసారి ప్రియుడిని పిలిపించి సుత్తితో ఆమె తలపై మోది హత్య చేశారు. హత్య సమయంలో కుమార్తె ప్రియుడు.. మృతురాలికి మధ్య తీవ్ర పెనుగులాట జరిగింది. తన తల్లిని కిరాతకంగా హత్య చేస్తున్న సమయంలో ఏ మాత్రం జాలి లేకుండా కూతురు ప్రవర్తించింది. పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నారు. హత్య జరిగిన ప్రాంతంలో జీడిమెట్ల పోలీసులు క్లూస్ సేకరించి విచారణ చేస్తున్నారు.

# వాదనలు పూర్తి, తీర్పు రిజర్వ్

- **2021 నాటి కేసు కొట్టివేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభ్యర్థన**
- **చౌటుప్పల్ పీఎస్‌లో నమోదైన కేసుపై హైకోర్టులో విచారణ పూర్తి**
- **జగదీశ్ రెడ్డి నుంచి మైక్ లాక్కున్నారని ఆరోపణ**
- **తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదన**



తనపై 2021లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ ముగిసింది. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదైంది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. 2021లో జరిగిన ఒక బహిరంగ సభలో అప్పటి మంత్రి జగదీశ్ రెడ్డి చేతిలో నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మైక్‌ను లాక్కున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై చౌటుప్పల్ తహశీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రాజగోపాల్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసులో చౌటుప్పల్ పోలీసులు తమపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ, కేసును కొట్టివేయాలని రాజగోపాల్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపిస్తూ, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది కూడా తమ వాదనలు సమర్పించారు.

# ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి?

(మొదటి పేజీ తరువాయి)



గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు. అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ రేవంత్ రెడ్డి..? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా? 1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా? ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా? పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేసినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా? ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా? జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా? వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా? మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నడు. బీఆర్ఎస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పండి. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి ...

◆ **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





మున్నేరు నది కిరువైపులా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతి, భూ నిర్వాసితుల కు పోలేపల్లి వద్ద కేటాయించనున్న ప్రభుత్వ స్థలాన్ని మంగళ వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, పోలేపల్లి వద్ద క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రిటైనింగ్ వాల్, డ్రెయిన్, రోడ్డు నిర్మాణాలు, పరిహార భూమి అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎర్త్ వర్క్ 41 శాతానికి పైగా, సిమెంట్ కాంక్రీట్ పనులు 32 శాతం మేర పూర్తయినట్లు, నగరం నుండి వివిధ డ్రెయిన్ల నుండి వచ్చే వరద నీరు నిర్వహణ గురించి, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి చర్యల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మున్నేరు నదికి ఇరువైపులా ఎనిమిదిన్నర కిలో మీటర్ల చొప్పున మొత్తం 17 కిలో మీటర్లు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, దీని కోసం 138 ఎకరాల పట్టా భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ భూమి, అభ్యంతరం లేని చోట్ల పనులు జరుగుతున్నాయని అన్నారు. పోలేపల్లి రెవెన్యూ గ్రామంలో అందుబాటులో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు 300 ఎకరాల ప్రభుత్వ భూమిని అన్ని విధాల అభివృద్ధి చేసి, భూ నిర్వాసితులకు పరిహారంగా అందించేలా ఒప్పించాలని కలెక్టర్ అన్నారు. పరిహారంగా ఇవ్వనున్న భూమిని చదును చేసి, ప్లాట్లుగా విభజించి, రోడ్లు, ప్రభుత్వ పరంగా అన్ని సదుపాయాల కల్పన చేసి, భూ విలువ గురించి భూ నిర్వాసితులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటి వరకు 70 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి పట్టాదారులు ఒప్పుకున్నట్లు, మిగతా వారితో చర్చలు జరిపి ఒప్పించాలని కలెక్టర్ తెలిపారు. మున్నేరు వరదలతో నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మున్నేరు వరదలకు పై నుండి వచ్చే ఆకేరు తదితర నీటి మట్టాలను, ప్రవాహ ఉధృతులను ఎప్పటి కప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో జలాశయాలు, నదుల నీటి మట్టాలపై ప్రతిరోజు నివేదిక ఇవ్వాలని, ప్రమాద స్థాయినీ ముందస్తుగానే సమాచారం ఇచ్చినచో, ప్రభావిత ప్రాంతాల ప్రజల తరలింపు ప్రక్రియతో నష్టం జరగకుండా చర్యలు చేపట్టవచ్చని కలెక్టర్ అన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ దిశగా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఇఇ అనన్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ మండల తహశీల్దార్లు సైదులు, రాంప్రసాద్, ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66 వ డివిజన్ హసన్ పర్తి మండల కేంద్రంలో డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మాట్లాడుతూ తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయల వ్యవసాయ భరోసా కింద రైతులకు అందజేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి వెంకన్న, వీసం సురేందర్ రెడ్డి, జన్ను రవీందర్, ఆరెల్లి వెంకటస్వామి, బస్కూరి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు వీర సుధాకర్, డివిజన్ యూత్ అధ్యక్షుడు తాళ్ల మధు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, పెద్దమ్మ నరసింహారాములు, జన్ను రమేష్, జన్ను బంతి, వల్లాల గంగాధర్, ఎన్టీఆర్ మొగిలి, మేకల రవీందర్, పెద్దమ్మ సురేష్, పల్లపు అనూష కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## యువ జర్నలిస్టు దత్తురెడ్డి హఠాన్మరణం బాధాకరం

◆ **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఈనాడు వరంగల్ రిపోర్టర్ జీడిపల్లి దత్తురెడ్డి హఠాన్మరణం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. చిన్న వయసులోనే తనదైన శైలిలో పత్రికా రంగంలో గుర్తింపు పొందిన దత్తురెడ్డి గుండెపోటుతో మరణించటం బాధాకరమన్నారు. పత్రికా రంగం బాధ్యతతో పనిచేసిన దత్తురెడ్డి లాంటి యువ పాత్రికేయుడిని కోల్పోయిందని, ఆయన చేసిన సేవలు మరవలేనివని నామ తెలిపారు. దత్తురెడ్డి మృతిపై ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన నామ, వారి కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## తన పిల్లలను సర్కార్ బడిలో చదివిస్తున్నా ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

◆ **ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలి**
◆ **అప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుంది**
◆ **ప్రతి ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు కుమారస్వామిని ఆదర్శంగా తీసుకోవాలి**
◆ **బిఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి**

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**

మండలంలోని చాగల్ గ్రామానికి చెందిన కుమారస్వామి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన స్వంత పిల్లలను ప్రైవేట్ లేదా కార్పొరేట్ విద్యాసంస్థలలో కాకుండా, తానే పనిచేస్తున్న పాంనూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనే చేర్పించి చదివిస్తున్నట్టు స్థానిక విద్యా సంఘాలు వెల్లడించాయి. ఈ ఉత్తమ సంకల్పానికి గుర్తింపుగా ఆయనను పాఠశాల ఆవరణంలో శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ యండి యూనస్, జనసేన విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మునిగాల పవన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయులే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చదిపితేనే ప్రజలకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యాపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కుమారస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఇప్పటి వరకు 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న కుమారస్వామి తన ముగ్గురు పిల్లలను అంగన్‌వాడీ, ఎంపీపీఎస్ పాఠశాలలలో చదివించడాన్ని వారు ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివించే విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాం వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఇవి విద్యా ప్రమాణాల్లో మార్పునకు దోహదపడుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు నమోదవుతుండటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తెలియజేయాలని కోరారు. ఈ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరిగి మరింత మంది విద్యార్థులు అక్కడ చేరే అవకాశం ఉందని అన్నారు.

## మారుతి కాలనీ రోడ్ నంబర్ 2లో డ్రైనేజీ సమస్యల పరిష్కారం

◆ **ఎమ్మెల్యేకు కాలనీవాసుల కృతజ్ఞతలు**

**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు:**



హనుమకొండలోని మారుతి కాలనీ రోడ్ నంబర్ 2లో మురికి కాలువ నిర్మాణం విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో వర్ధన్నపేట శాసనసభ్యుడు కె.ఆర్. నాగరాజును కాలనీవాసులు మర్యాదపూర్వకంగా కలసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి అభివృద్ధి పట్ల ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కాలనీలో మిగిలిన మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లకు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. కాలనీలో ఇంకా కొనసాగుతున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పందిస్తూ, మిగతా అభివృద్ధి పనులన్నీ త్వరలోనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్ల పనులు కూడా వేగవంతంగా పూర్తయ్యేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీకి చెందిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, ప్రచార కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హసన్ పర్తి సిఐ చేరాలు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హసన్ పర్తి మండలం ఏల్లాపూర్ గ్రామానికి చెందిన భాష బోయిన యాదగిరి యాదవ్(45) గత రెండు సంవత్సరాలుగా కాలు వేళ్ళకు ఇన్ఫెక్షన్ అవడంతో మానసికంగా బాధపడుతూ జీవితం మీద విరక్తి చెంది సోమవారం రోజున ఉదయం 11 గంటలకు బావుపేట క్రాస్ రోడ్ వద్ద గల ఆర్బిట్ స్కూల్ వెనుక మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో 108 అంబులెన్స్ లో ఎంజీఎం ఆస్పత్రి వరంగల్ లో ప్రథమ చికిత్స చేయించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఏకశిలా మ్యాక్స్ కేర్ దవాఖానాలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రోజున ఉదయం 9:32 నిమిషాలకు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన యాదగిరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హసన్ పర్తి పోలీసులు తెలిపారు.



## ప్రైవేట్ పాఠశాల గోడౌన్ సీజ్

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి పట్టణం, కాకర్లపల్లి రోడ్ లో నడపబడుతున్న నారాయణ కార్పొరేట్ పాఠశాల కు చెందిన పుస్తకాల గోడౌను మంగళవారం సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు సీజ్ చేశారు. పుస్తకాలపై ఎమ్మార్పీ ధరలు లేకుండా పుస్తకాలు ముద్రించి నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల పుస్తకాల గోడౌన్ ఎదుట ధర్నా జరిగింది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు అక్కడికి చేరుకుని విచారించి పుస్తకాలు విక్రయించే భవనానికి తాళం వేశారు. సత్తుపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల గోడౌన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలని, ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను మూసివేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



## ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన అర్షియా

**హ్యాట్రిక్ చేసిన విశ్వశాంతి**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం(రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం) ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో స్థానిక విశ్వశాంతి విద్యాలయం విద్యార్థిని ఎండి. అర్షియా సీట్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి అర్షియాతో పాటు ఆమె తల్లి రాబియాను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అర్షియా మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో తాను 569 మార్కులు సాధించినట్లు తెలిపారు.

విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, తమ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు గత మూడు సంవత్సరాలుగా వరుసగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం ద్వారా హ్యాట్రిక్ చేశారని పేర్కొన్నారు.

ఈ విద్యా సంవత్సరం అర్షియ, గత సంవత్సరం బిందు హాసిని, అంతకుముందు సంవత్సరం సాదియా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం జరిగిందన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వ్యక్తినీ అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్...

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డు నందు అన్నవరపు అంజిరెడ్డి సన్నాఫ్ వెంకట నరసింహారెడ్డి 45 సంవత్సరాలు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ తన ఇంట్లో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ మంగళవారం జాయింట్ ఆపరేషన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, డాక్టర్ కళావతి భాయ్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎంహెచ్ఎన్ డాక్టర్ సైదులు, మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది తో కలిసి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అక్రమంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నటువంటి నిందితుడు అన్నపురెడ్డి అంజిరెడ్డిని అతనితో పాటు అతని నిర్వహిస్తున్న స్కానింగ్ మిషన్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగింది. నిందితుడిని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో అప్పగించి కేసు నమోదు చేయడం జరిగింది. స్కానింగ్ మిషన్ దానికి సంబంధించిన పరికరాలని పంచినామా చేసి సీజ్ చేయటం జరిగింది. పిసి అండ్ పిఎన్డిటి యాక్ట్ 1994 చట్టం ప్రకారం నిందితుడికి పిసి పెయింట్ యాక్ట్ సెక్షన్ సిక్స్ చట్టరీత్యా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరంగా పరిగణించి అలాగే సెక్షన్ 23 సెక్షన్ నిర్ధారణ చేస్తున్న సక్షన్ 23 ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 10 వేల రూపాయల వరకు ఫైన్ అలాగే సెక్షన్ 25 ప్రకారం అతడు స్కానింగ్ మిషన్ ని అనధికారికంగా పర్చేస్ చేసి ఇటువంటి అర్హత లేకుండా లింగ నిర్ధారణ పరీక్షలకు పూనుకోపటం వల్ల సెక్షన్ 25 ప్రకారం ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష లక్ష రూపాయలు అపరాధ రుసుము ఇది ఇచ్చే అవకాశం ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ కళావతి భాయ్ మాట్లాడుతూ జిల్లాలో ఇలా అక్రమంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నటువంటి నిందితులని వదిలే ప్రసక్తే లేదని, వారిని దోషులు చట్టం ముందు నిలబెట్టి కఠినమైన శిక్షలు వేయించే విధంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ ఆపరే ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఏసిపి టాస్క్ ఫోర్స్ ఏసిపి రవి కి మరియు వారి సిబ్బందికి అలాగే త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మరియు సబ్ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# దేవాదుల ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి

- **స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**జనగాం,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేవాదుల ఎత్తిపోతల పథకంపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం జరిగింది.



ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా ఈ సీజన్ లోనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా అశ్వరావుపల్లి కుడి ప్రధాన కాలువ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. మొత్తం 20 డిస్ట్రిబ్యూటరీస్, వాటికి అనుబంధంగా ఉన్న సబ్ మైనర్లలో సిల్ట్ తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా సాగించాలని సూచించారు.

ఒక్క 20L కిందనే 14 వేల ఎకరాల ఆయకట్టు ఉండటంతో పనుల్లో ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఘనపూర్ నుంచి నవాబ్ పేట ప్రధాన కాలువలోని 10 డిస్ట్రిబ్యూటరీస్‌లో సిల్ట్ రిమూవల్ పనులు చేయాలని, 4L లో షెటర్ ఏర్పాటు చేయాలని, నవాబ్ పేట అప్రోచ్ ఛానల్‌ను శుభ్రం చేయాలని సూచించారు.

ప్యాకేజీల 1, 2, 3 పనులను తక్షణమే పూర్తి చేయాలని, పంపు హౌస్ నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మల్లన్నగండి కుడి కాలువ ద్వారా ఈ సీజన్‌లో నీరు ఇవ్వాల్సిందిగా కోరారు. దేవాదుల పథకంలోని మొదటి, రెండవ, మూడవ దశలలో పూర్తి స్థాయిలో పంపింగ్ జరగాలన్నారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజీలో నీటి లభ్యత ఉన్నందున అక్కడి నుంచి పంపింగ్‌కు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ధర్మసాగర్ నుంచి నీటి పంపిణీపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ధర్మసాగర్, ఘనపూర్, నవాబ్ పేట, అశ్వరావుపల్లి రిజర్వాయర్లను 20 రోజుల్లో నింపాలని సూచించారు. ధర్మసాగర్ నార్త్, సౌత్ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాలని తెలిపారు.

ఈ సందర్భంగా "మన జిల్లా - మన నీరు" కార్యక్రమం కింద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఘనపూర్ AMC చైర్మన్ లావణ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలన అందరూ బాధ్యతగా తీసుకోవాలి


- **అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాద్ రావు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మాదకద్రవ్యాల నిర్మూలన అందరూ బాధ్యతగా తీసుకోవాలని అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాద్ రావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్, ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో స్లోగన్ రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. నినాద రచన పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజా యి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని ఆయన అన్నారు. సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టి జి ఏ ఎన్ బి డి.ఎస్.పి శ్రీధర్, సీఐ విజయ్, ఖమ్మం అర్బన్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ పాల్గొన్నారు.





# పండగ వాతావరణంలో రైతు భరోసా విజయోత్సవ సంబరాలు

- **రైతు భరోసా పథకానికి రైతుల నుంచి విశేష స్పందన**
- **రైతు భరోసా విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం**

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

లింగాల ఘనపూర్ మండలంలోని బండ్లగూడెం గ్రామ రైతు వేదికలో నిర్వహించిన రైతు భరోసా విజయోత్సవ కార్యక్రమంలో పండగ వాతావరణం నెలకొంది. వానాకాలం సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో, మొత్తం 9 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 9వేల కోట్ల రూపాయలు సుమారు 70లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం గొప్ప ఘట్టంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు వేదికలతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు రైతు భరోసా పథకం నిదర్శనమని పేర్కొన్నారు.

"9రోజుల్లో 9వేల కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేయడం సాధారణ విషయం కాదు. ఇది చరిత్రలో ఒక మైలురాయి" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల అపోహలను తిప్పికొట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇతర పథకాల విషయానికొస్తే, ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు 21వేల కోట్ల రూపాయల రుణ మాఫీ, సన్న బియ్యానికి బోనస్, సాగునీటి ప్రాజెక్టుల వేగవంతమైన అమలుతో రైతులకు మరింత నైతిక బలాన్ని అందిస్తున్నట్టుగా వివరించారు. వ్యవసాయ రంగాన్ని కేంద్రంగా చేసుకుని అభివృద్ధిని సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. ప్రజలు, రైతులు ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.

అనంతరం లింగాల ఘనపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు ₹2,43,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యనారాయణ రాజు స్మారకంగా మోటివేషనల్ టాక్

- **విద్యార్థులకు ఉత్సాహాన్ని పంచిన ఆదిత్య యాదవ్**


**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో దివంగత ఉపాధ్యాయుడు సత్యనారాయణ రాజు స్మారకార్థంగా మోటివేషనల్ ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ అధ్యక్షత వహించారు.




ఈ సందర్భంగా ప్రసంగించిన సోషల్ అండ్ స్టూడెంట్ యాక్టివిస్ట్ ఆదిత్య యాదవ్ మాట్లాడుతూ, "ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి. వాటిని వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలి," అని అన్నారు. కృత్రిమ మేధా సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని, అది మానవ జీవిత సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.

విద్య ద్వారా మాత్రమే మంచి జీవనశైలి సాధ్యమవుతుందని, చదువుతో పాటు ఆటలు, సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల విద్యార్థులలో చురుకుదనం పెరుగుతుందని చెప్పారు. "ప్రత్యేకమైన వ్యూహాలతో, విశ్లేషణాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకోవాలి," అని సూచించారు.




కార్యక్రమంలో సత్యనారాయణ రాజు కుమారుడు బిరుదరాజు రాము, కుటుంబ సభ్యుడు లలిత్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల శారీరకాభివృద్ధి కోసం ఆదిత్య యాదవ్ బృందం పాఠశాలకు షటిల్ రాకెట్లు, బోర్డులు, నెట్స్, షటిల్ కాక్స్ వంటి క్రీడా సామగ్రిని విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, పద్మజ, కిరణ్ మై, రామకృష్ణ, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మంటగలుస్తున్న మానవ సంబంధాలు

- **కన్నా కూతురి పై ఓ తండ్రి లైంగిక వేదింపులు**

**హైదరాబాద్, జూన్ 24 :**

మానవసంబంధాలు ఎటు పోతున్నాయో తెలియడం లేదు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురి పట్ల ఓ తండ్రి ప్రవర్తించిన తీరు చూస్తుంటే అసలు బంధాలు బతికున్నాయా అని అనిపిస్తుంది. ఆడబిడ్డలకు తండ్రి అంటే వల్లమాలిన ప్రేమ. ఒకప్పుడు ఇంటి యజమానితో ఎంతో భయం, బాధ్యతతో ఉండేవారు. కానీ ఇప్పటి తండ్రులు పిల్లలతో స్నేహంగా ఉంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. ఎన్ని కష్టాలొచ్చినా తనలోనే దాచుకుని.. తమ కన్న బిడ్డలకు మాత్రం ఏ కష్టం రానీయకుండా చూసుకుంటున్నారు తండ్రులు. కానీ ఇప్పుడు చెప్పుకోబోయే వ్యక్తి గురించి తెలిస్తే.. తండ్రంటేనే ఆడపిల్లలు భయపడిపోతారేమో. కన్న బిడ్డను రక్షించాల్సిన తండ్రే భక్షకుడిగా మారాడు. కామాంధుల చెర నుంచి కాపాడాల్సిన ఆ తండ్రి.. బిడ్డకు అంతులేని దు:ఖాన్ని మిగిల్చాడు. అసలేం జరిగిందో ఇప్పుడు చూద్దాం.హైదరాబాద్‌లోని బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో అమానుష ఘటన చోటు చేసుకుంది. తన రక్తం పంచుకుని పుట్టిన కన్న బిడ్డనే చెరబట్టాలని ప్రయత్నించాడు ఓ తండ్రి. మద్యం ఎలాంటి వారిని ఎలా మారుస్తుందో అందరికీ తెలిసిందే. మద్యం సేవిస్తే ఎదుట ఉంది భార్యో, కూతురో కూడా తెలియకుండా విచక్షణ మరిచి ప్రవర్తించాడు ఓ తండ్రి.




స్థానికంగా ఉంటున్న నాగరాజు తాగుడుకు బానిసయ్యాడు. ఇంటిని పోషించకపోవడంతో పాటు సంపాదిస్తున్న భార్యను కూడా చిత్రహింసలకు గురిచేసేవాడు. అంతటితో ఆగకుండా కన్న కూతురిపట్ల కూడా దారుణంగా ప్రవర్తించాడు.మద్యం మత్తులో కూతురి శరీర భాగాలు తాకి వేధింపులకు గురిచేశాడు నాగరాజు. భయపడిపోయిన కూతురు పెద్దగా కేకలు వేయడంతో వెంటనే అక్కడకు చేరుకున్న తల్లి.. నాగరాజు బారి నుంచి కుమార్తెను రక్షించుకుంది. ఆపై పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఈ దారుణ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి తరచూ తనపై, తన బిడ్డపై విచక్షణారహితంగా దాడి చేస్తాడని భార్య ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే కన్న బిడ్డపై తండ్రే ఇలాంటి దారుణానికి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# కాకి బ్రతుకా వద్దు..? హంస బ్రతుకే ముద్దు..!



(బహుజన చైతన్య స్ఫూర్తి గీతం)

ఓ బహుజన మిత్రమా..!
ఎంతకాలం నీవిలా
అజ్ఞానపు అంధకారంలో...
అమాయకపు ఆత్మవిశ్వాసంతో...
దహించుకుపోతూ బ్రతుకుతావు..?

ఇకనైనా...
ఈ కంప్యూటర్ యుగంలోనైనా...
నీ బలహీనతల ఊబినుంచి
బయటపడాలనుకో...!
నీ తరతరాల బానిసత్వపు
ఉక్కుసంకెళ్ళను త్రెంచాలనుకో..!

శిలను శిల్పంగా చెక్కాలనుకో...
ఎవరెస్టు శిఖరం ఎక్కాలనుకో..!
నీ కులదైవం...
అమరజీవి అంబేద్కర్‌కు
మ్రొక్కాలనుకో..!

పక్షిలా ఎగర...నీయకుండా...
మొక్కలా ఎదగ...నీయకుండా...
నిన్ను అణచివేసిన అహంకారులకు
నీవు సింహస్వప్నంగా మారాలనుకో..!
చీడపురుగులను చీల్చిచెండాడే
అగ్నిజ్వాలగా జ్వలించాలనుకో..!

కామందుల చెప్పలా
బ్రతకాలనుకోకు...
చెప్పకింద తేలులా
జీవించాలనుకోకు...
వారి మెడపై వ్రేలాడే పదునైన కత్తిలా...
ప్రక్కలో బల్లెంలా నీవు
బ్రతకాలనుకో...!

ఆకులు మేసే మేకలా కాక...
గర్జించే సింహంలా గర్వంగా
బ్రతుకు...
గజరాజులా భూమిని బద్దలుకొట్టు..!
ఆరక రగిలే అగ్నిజ్వాలవై
కులవివక్షతను వైషమ్యాలను
దహించు.!

ఓ బహుజన మిత్రమా..!
కాకిలా కలకాలం బ్రతికినా...
కడకు దొరికేది కాటిలో పెట్టే
పిండమే..!
కానీ హంసలా కొద్దికాలం బ్రతికినా..?
అందుకోవాలి నీవు అంబేద్కర్
ప్రసాదించిన హక్కుల
అమృతభాండమే.!
ఓ బహుజన మిత్రమా..! తక్షణమే
మేలుకో...నీ జాతిని జాగృతం చెయ్..!



రచన:
కవిరత్న
సాహిత్యధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్
చరవాణి...9110784502

# గుండె గుడి

ఆధునిక కాలం
గ్రహాంతరాలకు
మనిషిప్రయాణం!

సైన్స్ ప్రపంచంలో
పనికిరాని పాతను
మోస్తూనే ఉన్నాం!

మతం మందిరాలు
ఒకనాటిమాట!
అది'పాత'సామాను!

ఆది నుండీ అవి
రాజకీయాలకే
ఉపయోగ పడ్డాయి!

తన గుడికట్టమని
మోడీ కలలోకొచ్చి
చెప్పాడా రాముడు?

ఆంజనేయ స్వామి
ఆనాడే తన రాముణ్ణి
గుండెల్లోచూపించాడు!

హనుమాన్ సూచనతో
దేవుణ్ణి మీ 'గుండె
గూటి' లో ఉంచండి!

గుడి మసీద్ చర్చి
సామజికం కాదు!.
అది వ్యక్తిగతం!

నోరులేదుకదాఅని
దేవుణ్ణి రాజకీయాలకు
వాడుకోవద్దు!

'గుండెగుడి'ని కట్టండి
మతకల్లోలాలులేకుండా
ప్రశాంతంగాఉండండి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఆ వ్యాఖ్యలు బీజేపీలో చేరికకు సంకేతాలు కావు : శశిథరూర్

న్యూఢిల్లీ,, (తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శశిథరూర్ మోదీ ప్రభుత్వ అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు. తాజాగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాలపై ప్రశంసలు కురిపిస్తూ ఆయన ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఆయన బీజేపీలో లో చేరడం ఖాయమనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ ఊహాగానాలపై తాజాగా థరూర్ స్పందించారు.అది ఆపరేషన్ సింధూర్ విజయాన్ని వివరించిన వ్యాసమని, అన్ని పార్టీల ఐక్యతను అది చెబుతోందని శశిథరూర్ అన్నారు. ఇతర దేశాలతో సంబంధాలు బలపరుచుకోవడంలో ప్రధాని మోదీ శక్తి, చైతన్యం ప్రదర్శించారని తాను చెప్పానని తెలిపారు. ఇది బీజేపీ లేక కాంగ్రెస్ విదేశాంగ విధానాలకు సంబంధించినది కాదు, ఇది భారత విదేశాంగ విధానం గురించి మాత్రమేనని అన్నారు. తాను 11 ఏళ్ల క్రితం పార్లమెంటు విదేశాంగ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం చెప్పానని గుర్తుచేశారు. తాను ఇలా మాట్లాడటం బీజేపీలో చేరడానికి సంకేతం కాదని, ఇది జాతీయ ఐక్యతకు సంబంధించిందని ఆయన పేర్కొన్నారు.శశిథరూర్ రాసిన వ్యాసాన్ని ప్రధాని కార్యాలయం సోమవారం ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రపంచవ్యాప్తంగా దేశం ఒంటరిగా ఉందంటూ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు విరుద్ధంగా ఆ వ్యాసంలో థరూర్ అభిప్రాయాలు ఉండటం గమనార్హం. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు రుజువుగా పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు, ఆపరేషన్ సింధూర్‌తో భారత్ దృఢమైన ప్రతిస్పందనను చాటి చెప్పిందని తెలిపారు. ఇది మన విదేశాంగ విధానానికి కీలక ఘట్టాన్ని అందించిందని వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాత పార్టీ

- నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శప్రాయం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు పక్షపాత పార్టీ అని, నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శనీయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతగా రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజి శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వేంకటేశ్వరరావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ,జిల్లా, నగర కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు,కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించనైనది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు మన రాష్ట్ర చరిత్రలో లిఖించదగ్గ రోజని ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని రాష్ట్రాలకు మోడల్ గా మన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని, రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులను విడుదల చేసి, ఇప్పటి వరకు 1కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలనికోరారు.

అదేవిధంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఏ ఐ సి సి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేసి,మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించనైనది.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఐ యన్ టి యు సి, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, మైనారిటీ, ఎస్ సి సెల్ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, కోటేరు నర్సిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వేంకటేశ్వరరావు, మాజి యంపిటిసి నల్లమోతు లక్ష్మయ్య, నగర ఓబీసీ సెల్, ఐ యన్ టి యు సి, ఎస్ టి, మైనారిటీ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, దేవత్, శంకర్ నాయక్, షేక్ అబ్బాస్ భేగ్,కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సైదుబాబు,చామకూరి వెంకటనారాయణ,దుద్దుకూరి వేంకటేశ్వరరావు, మందడపు లక్ష్మి మనోహర్,కన్నం ప్రసన్నకృష్ణ, తాతా రఘురాం,వాంకుడోత్ దీపక్ నాయక్,విప్లవ కుమార్ పటేల్, గడ్డం వెంకటయ్య,బీరెడ్డి రమేష్, యాసబోయిన శ్రీశైలం,బబ్బూరి నరేంద్ర, కాళంగి కనకరాజు, బోడా శ్రావణ్,జగదీశ్,జాకీర్ హుస్సేన్, యూసఫ్, పర్వత శ్రీనివాస్, కమతం రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, రజి భాయ్, జహీర్ భాయ్, వాసీం,మహమూద్, భూక్యా సురేష్ నాయక్,కందుల శ్రీనివాస్,కొలికపొంగు రమేష్, పాషా , గాదర్ బాబు, కలిమెల భద్రం ,ఫరీద్ ఖాద్రి, కొత్తపల్లి పుష్ప, కొర్లపాటి అన్నపూర్ణ,దామా స్వరూప,ఊరుకొండ చంద్రిక, చల్లా ప్రతిభారెడ్డి, జ్యోతి, రమాదేవి, ఝాన్సీ, బలుసు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం...

సీఎం రేవంత్ రెడ్డి

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:





రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు విజయోత్సవ సభ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, సీఎస్ కె. రామకృష్ణారావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 70 లక్షలకు పైగా రైతులకు కోటి 49 లక్షల పైగా ఎకరాలకు ప్రభుత్వం 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు జమ చేసిన నేపథ్యంలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని, అండగా నిలిచిన తెలంగాణ రైతాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూమి కోసం భుక్తి కోసం రైతాంగ పోరాటాలు జరిగాయని, భూమి చుట్టూ మన జీవితం ముడిపడి ఉందని అన్నారు. వ్యవసాయం దండగ పరిస్థితి నుంచి వ్యవసాయం పండుగ చేయాలని గతంలో డాక్టర్ వైయస్సార్ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్తు అందించడంతో పాటు పెండింగ్ విద్యుత్ బకాయిలను రద్దు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత రైతాంగం మాత్రమేనని, రైతులు, మహిళలు, తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థులే తమ ప్రాధాన్యత అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల 35 వేల 964 మంది రైతులకు 20 వేల 617 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేసి రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున రైతులను రుణ విముక్తి చేశామని అన్నారు. కొనుగోలు ప్రభుత్వ పరిధిలోని అంశం కాదని గత పాలకులు బాధ్యత నుంచి తప్పుకుంటే, ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడమే కాకుండా సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లించిందని అన్నారు.

ప్రజా ప్రభుత్వం అందించిన భరోసా మేరకు తెలంగాణ రైతాంగం వరి పండించడంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాలను దాటిందని, 2 కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, గతంలో తాళ్ల పేరుతో రైతులకు 10 కిలోల వరకు కటింగ్ చేసే వారని, నేడు ఆ దోపిడీనీ తమ ప్రభుత్వం పూర్తిగా నిలువరించిందని, రైతులకు మద్దతు ధర 48 గంటల్లో జమ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. 18 నెలల కాలంలో రైతుల సంక్షేమానికి లక్షా 4 వేల కోట్ల కోట్ల రూపాయలను ప్రజా ప్రభుత్వం ఖర్చు చేసిందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం క్రింద క్యాంటీన్, పెట్రోల్ బంక్, రైస్ మిల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సులు వంటి అనేక వినూత్న వ్యాపారాలను మహిళలతో ప్రారంభిస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు మొదటి సంవత్సరం 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, హైదరాబాదులో శిల్పారామం దగ్గర నాలుగు ఎకరాల స్థలం కేటాయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులు అమ్మకానికి షాపులు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చేతిలో పెట్టామని, ఏక రూప దుస్తులను మహిళా సంఘాలతో కుట్టిస్తున్నామని అన్నారు. గోదావరి, కృష్ణా నది జలాలపై చర్చకు ప్రతిపక్ష నాయకులు ముందుకు రావాలని, అసెంబ్లీలో చర్చకు స్పీకర్ కు లేఖ రాస్తే వెంటనే శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి అసెంబ్లీను సమావేశ పరుస్తారని అన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, రాబోయే రోజుల్లో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తామని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల రైతుల ఖాతాలో జమ చేయడం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన గొప్ప కార్యక్రమం అని, వ్యవసాయానికి ఉచిత కరెంట్, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించాలని మద్దతు ధర, బ్యాంకుల ద్వారా ప్రయార్టీ సెక్టార్ క్రింద రైతులకు రుణాలు పంపిణీ చేయడం, హరిత విప్లవం వంటి అనేక కార్యక్రమాలను ప్రవేశ పెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, ఇందిరమ్మ ప్రభుత్వం 21 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని, రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. గత పాలకులు రైతులకు అందించే డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, మద్దతు ధర, బోనస్, వడ్డీ లేని రుణాలు, పంట నష్టపరిహారం వంటి అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి కేవలం అరకొర రైతు బంధు కార్యక్రమం నిర్వహించిందని, తమ ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేస్తూనే మిగిలిన సంక్షేమ కార్యక్రమాలను కూడా చేపట్టిందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నామని, మన పథకాలను ఇతర రాష్ట్రాల పాలకులు పరిశీలిస్తున్నారని, రైతాంగం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాజీవ్ గాంధీ సూచనల మేరకు ఉత్తమ పాలన సాగుతుందని అన్నారు.

రైతు భరోసా నిధులు జమ అయ్యాయని తెలంగాణ రైతాంగం చేసుకుంటున్న సంబరాలలో తాము భాగస్వామ్యం అవుతున్నామని అన్నారు. 25 లక్షల మంది రైతులకు తెలంగాణ రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి 2 లక్షల వరకు పంట రుణ మాఫీ పూర్తి చేశామని మంత్రి గుర్తు చేశారు. పంట కాలానికి పెట్టుబడి సహాయం అందించాలనే లక్ష్యంతో 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామని, దీనికి సహకరించిన ఆర్థిక శాఖ మంత్రివర్యులు డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రైతు వేదిక నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రైతు వేదికలోని రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 3 లక్షల 53 వేల మంది రైతులకు 430 కోట్ల రైతు భరోసా నేటితో పూర్తయిందని, రైతుకు పెట్టుబడి సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసా సహాయంతో పాటు వ్యవసాయం లాభసాటిగా జరగాలని అన్ని రకాల మద్దతు ప్రభుత్వం రైతులకు అందిస్తుందని, అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా మండల అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో వానాకాలం దాదాపు 6 లక్షల 7 వేల ఎకరాల పంట సాగు జరుగుతుందని, దీనికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, మండల వ్యవసాయ అధికారిణి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై ఆర్టీసీ బస్సుల్లో వైఫై

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఈ ప్రతిపాదనలపై ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలను అందించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బస్సులు, బస్టాండ్లు, రవాణాశాఖ కార్యాలయాల్లో వైఫై సదుపాయాలను అందించాలని ప్రైవేటు సంస్థ ప్రతిపాదించింది. ఇది సాధారణ ఇంటర్నెట్ యాక్సెస్ కాకుండా..ముందుగా సెలక్ట్ చేసిన సినిమాలు, సాంగ్స్ వంటి కంటెంట్‌ను ప్యాసింజర్స్ తమ మొబైళ్లలో చూసేలా ఏర్పాటు చేస్తామని పేర్కొంది. వైఫై ద్వారా అందించే కంటెంట్ మధ్య అడ్వర్టైజ్‌మెంట్స్ కూడా వస్తాయి. ఈ ప్రకటనల ద్వారా ప్రైవేటు సంస్థకు ఆదాయం సమకూరుతుందని.. అందులో భాగస్వామ్యంతో ఆర్టీసీకి కూడా ఆర్థిక ప్రయోజనం ఉంటుందని ఆర్టీసీ వర్గాలు వెల్లడిరచాయి. ఈ ప్రతిపాదనలపై మరింత స్పష్టత కోసం త్వరలో ఆ సంస్థ, ఆర్టీసీ మధ్య మరో మీటింగ్ జరగనుంది. ఆ సమావేశం అనంతరం ప్రాజెక్ట్ అమలుకు సంబంధించిన పూర్తి కార్యచరణ రూపొందిస్తారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆర్టీసీ బస్సుల్లో




ప్రయాణం మరింత సౌకర్యవంతం అవుతుందని.. ప్రయాణికులు తక్కువ ధరలో వినోదాన్ని ఆస్వాదించగలరని భావిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పశ్చిమాసియాలో చల్లారిన యుద్ధ వాతావరణం

- అమెరికా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపిన ఇజ్రాయెల్ ప్రధాని
- ఇరాన్ అణు ముప్పు తొలగిందని ప్రకటన



ఇరాన్ తో అణు ముప్పు తొలగిపోయిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ విషయంలో తమ దేశానికి సహకరించిన అమెరికా అధ్యక్షుడికి నెతన్యాహు కృతజ్ఞతలు తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ సూచనల మేరకు కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్, ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించడంతో, గత కొంతకాలంగా కొనసాగుతున్న ఘర్షణ వాతావరణానికి తెరపడే అవకాశం ఏర్పడిరది. వివరాల్లోకి వెళితే.. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను ప్రారంభించినట్లు సమాచారం. దీనికి ప్రతిస్పందనగా, తాము కూడా సీజ్‌ఫైర్‌కు కట్టుబడి ఉంటామని ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా కాల్పుల విరమణ ఒప్పందం వాస్తవమేనని ధ్రువీకరించినట్లయింది.

# ఇరాన్, ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీ చేరుకున్న 380 మంది భారతీయులు


- ఇవాళ ఇరాన్ నుంచి 219 మంది, ఇజ్రాయెల్ నుంచి 161 మంది ఢిల్లీకి
- ఇజ్రాయెల్ నుంచి ఇదే మొదటి విమానం, జోర్డాన్ మీదుగా తరలింపు
- ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2,295 మందిని తీసుకొచ్చిన భారత్




మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' ద్వారా మంగళవారం మరో 380 మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో 219 మంది ఇరాన్ నుంచి రాగా, 161 మంది ఇజ్రాయెల్ నుంచి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) అధికారికంగా ప్రకటించింది. తాజా రాకతో ఇరాన్‌లో నెల కొన్న సంక్షోభ పరిస్థితుల మధ్య చిక్కుకున్న మొత్తం 2,295 మంది భారత పౌరులను ఇప్పటివరకు విజయవంతంగా వెనక్కి తీసుకువచ్చినట్లయింది. ఇరాన్‌లోని మషద్ నుంచి బయలుదేరిన ప్రత్యేక విమానం 219 మంది భారతీయులతో న్యూఢిల్లీలో ల్యాండ్ అయింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా తెలియజేసింది. ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్ నుంచి 219 మంది భారతీయ పౌరులను తరలించిన ప్రత్యేక విమానం ఈరోజు ఉదయం 03:30 గంటలకు మషద్ నుంచి న్యూఢిల్లీకి చేరుకుంది. దీంతో ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2,295 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చాం'' అని పేర్కొంది. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను తరలించే ప్రక్రియ నిన్న జోర్డాన్ మీదుగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి విమానంలో 161 మంది భారత పౌరులు మంగళవారం ఉదయం 8:20 గంటలకు అమ్మన్ నుంచి న్యూఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ బృందానికి కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి పబిత్ర మార్ఘరీటా స్వయంగా విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పబిత్ర మార్ఘరీటా మాట్లాడుతూ... ''ఇజ్రాయెల్ నుంచి తరలించిన 161 మంది భారతీయుల మొదటి బృందానికి స్వాగతం పలకడం చాలా సంతోషంగా ఉంది. వీరంతా కొద్దిసేపటి క్రితమే న్యూఢిల్లీ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు. మేము అక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాము. ఇరాన్ మరియు ఇజ్రాయెల్‌లోని మన పౌరులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నాము. ఆపరేషన్ సింధు కింద పౌరులందరూ సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు'' అని తెలిపారు మరో ప్రయాణికుడు మాట్లాడుతూ... ''విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అద్భుతంగా పనిచేసింది. తరలింపు ప్రక్రియ చాలా సజావుగా సాగింది. మా ప్రయాణాన్ని ఇంత సౌకర్యవంతంగా చేసినందుకు మంత్రిత్వ శాఖకు నా కృతజ్ఞతలు'' అని తెలిపారు.



# మూడో ప్రపంచ యుద్ధమే వస్తే ఈ దేశాల్లో సేఫ్





ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొంది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి అమెరికా అడుగుపెట్టడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉద్రిక్తతలు చల్లబడే అవకాశం ఉంది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరు దేశాలు ఏమేరకు కట్టుబడి ఉంటాయనే విషయంలో కొంత ఆందోళన ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అణు కేంద్రాలపై అమెరికా దాడులకు ముందే జాగ్రత్తపడ్డ ఇరాన్.. ఆయా కేంద్రాల నుంచి 400 కిలోల యురేనియం నిల్వలను రహస్య ప్రాంతానికి తరలించిందని ఇటు ఇజ్రాయెల్, అటు అమెరికా ఆరోపిస్తున్నాయి. ఈ విషయంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒకవేళ మూడో ప్రపంచ యుద్ధమే వస్తే భూమి మీద సేఫ్ గా ఉండే దేశాలు ఏవంటే..

అంటార్కిటికా, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, గ్రీన్‌లాండ్, ఇండోనేసియా, టువాలుజి, అర్జెంటీనా, భూటాన్‌జి, చిలీజి, ఫిజీజి, దక్షిణాఫ్రికాజి



# ఓవర్‌నైట్ స్టార్ మారిన బాలీవుడ్ నటుడు జైదీప్ అహ్లావత్

'పాతాళ్ లోక్' వెబ్ సిరీస్‌తో ఓవర్‌నైట్ స్టార్ మారిన బాలీవుడ్ నటుడు జైదీప్ అహ్లావత్. ఈ వెబ్ సిరీస్‌లో ఒక మధ్య తరగతి తండ్రిగా.. పోలీస్ స్టేషన్‌లో ఎవరు గుర్తించని ఇన్‌స్పెక్టర్‌గా జీవించేశాడు జైదీప్ అహ్లావత్. ఇప్పటికే రెండు సీజన్‌లు రాగా.. రెండు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. అయితే పాతాళ్‌లోక్‌తో పాపులర్ అయిన ఈ నటుడు మరో బంపరాఫర్‌ని దక్కించుకున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ కింగ్ సినిమాలో జైదీప్ ఒక కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని జైదీప్ స్వయంగా వెల్లడిరచాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో జైదీప్ మాట్లాడుతూ, షారుఖ్ ఖాన్‌తో కలిసి పని చేయడానికి ఎవరు మాత్రం నో చెబుతారని, ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ మొదట్లో తనను ఈ పాత్రకు తీసుకోవడానికి కాస్త ఆలోచించినప్పటికి, షారుఖ్ ఖాన్ స్వయంగా తనను కింగ్ చిత్రంలో భాగం కావాలని కోరారని జైదీప్ వెల్లడిరచారు. ఖాన్ సాబ్ ఖాన్ సాబే, ఎవరు మాత్రం ఆయన మాట కాదంటారు? అని ఆయన పేర్కొన్నారు. కింగ్ సినిమా విషయానికి వస్తే.. ఈ చిత్రం స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కూడా కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని వివరాల కోసం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# హీరోయిన్‌గా కనిపించి ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ : డేజ్లింగ్ ఇవానా..

కేరళలోని చంగనాచెరిలో ఓ ముస్లిం కుటుంబంలో జన్మించింది అందాల తార ఇవానా. అలీనా షాజీ ఈమె అసలు పేరు. ఈ వయ్యారి తండ్రి పేరు షాజీ చెరియన్. లియో, లయ అనే ఇద్దరు కవల సోదరుడు, సోదరి కూడా ఉన్నారు ఈ ముద్దుగుమ్మకి. కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలోని కేరళ యూనివర్సిటీ నుంచి బికామ్ డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి. 12 ఏళ్ల వయస్సులోనే 2012 మలయాళీ చిత్రం మాస్టర్స్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా తన యాక్టింగ్ కెరీర్ ప్రారంభించింది. తమిళ చిత్రం నాచియార్‌లో ఈ బ్యూటీ నటనకి తమిళంలో సిమ్మా, ఫిల్మ్‌ఫేర్ వేదికల్లో ఉత్తమ డెబ్యూ నటిగా అవార్డులు అందుకుంది. 2022లో ప్రదీప్ రంగనాథన్‌కి జోడిగా తమిళ రొమాంటిక్ కామెడీ సినిమా లవ్ టుడేలో తొలిసారి కథానాయకిగా నటించింది. తర్వాత 2023లో కోలీవుడ్ ఇండస్ట్రీలో , మతిమారన్ అనే చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో నటించింది ఈ అందాల భామ. 2024లో కల్వన్ అనే తమిళ్ కామెడీ డ్రామాలో హీరోయిన్‌గా కనిపించి ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. 2025లో ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెరకెక్కిన డ్రాగన్ సినిమలో అతిథి పాత్రలో కనిపించింది ఈ బ్యూటీ. ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా రూపొందిన రొమాంటిక్ కామెడీ సినిమా సింగల్‌తో హీరోయిన్‌గా తెలుగు చలన చిత్ర తెరంగేట్రం చేసింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో తెలుగులో ఈమెకు వరుస అవకాశాలు వచ్చేలా కనిపిస్తుంది.

# తన అందంతో కుర్రాళ్లను ఇట్టే ఆకర్షిస్తుంది.. నిధి అగర్వాల్..

నిధి అగర్వాల్.. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ.. తెలుగు కుర్రాళ్ల క్రష్ లిస్టులో చేరిపోయింది. నాగ చైతన్య జోడిగా తెలుగు పరిచయం అయినా ఈ బ్యూటీ.. ఇప్పుడు ఏకంగా ప్రభాస్ సరసన పాన్ ఇండియా సినిమా చేస్తుంది. ఎప్పుడు సోషల్ మీడియాలో క్రేజీ ఫొటోలతో హల్చల్ చేస్తుంది. అలాగే ఈసారి కూడా కొన్ని సిజ్లింగ్ ఫోటోలను అభిమానులతో పంచుకుంది. 17 ఆగస్టు 1993న తెలంగాణ రాజధాని హైదరాబాద్?లో జన్మించింది వయ్యారి భామ నిధి అగర్వాల్. పెరిగింది మాత్రం బెంగుళూరులో. హిందీ మాట్లాడే మార్వాడీ కుటుంబంలో జన్మించినప్పటికీ తెలుగు, తమిళం, కన్నడ భాషలను అర్థం చేసుకోవడంతోపాటు మాట్లాడగలదు ఈ బ్యూటీ. 2014లో మిస్ దివా యూనివర్స్ పోటీల్లో పాల్గొంది అందాల భామ నిధి అగర్వాల్. ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. హిందీలో మున్నా మైకెల్ అనే సినిమాతో హీరోయిన్?గా పరిచయం అయ్యింది. ఈ సినిమా తర్వాత టాలీవుడ్ కు మకాం మార్చింది. 2018లో అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో తెలుగు చలన చిత్ర అరంగేట్రం చేసింది. ఈ సినిమా అంతగా మెప్పించలేకపోయిన తెలుగులో మంచి క్రేజ్ అందుకుంది. తర్వాత వరుస సినిమాలు క్యూ కట్టాయి. 2019లో అక్కినేని అఖిల్?కు జోడిగా మిస్టర్ మజ్ను సినిమా సినిమాలు ఫ్లాప్ అయింది. అదే పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమా ఈ బ్యూటీకి భారీ హిట్ అందించింది. ఈ సినిమాలో తన అందాలతో ఆకట్టుకుంది. ఈ సినిమాతో మంచి గుర్తింపు వచ్చింది. ఇక ఇప్పుడు తెలుగు పవన్ కళ్యాణ్ సరసన నటించిన హరిహర వీరమల్లు త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ప్రభాస్?కి జోడిగా ది రాజా సాబ్ సినిమాలో నటిస్తుంది ఈ మూవీ డిసెంబర్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.






## ఐకాన్ మూవీ కోసం వేరే హీరోని తీసుకునే ఆలోచనలో ఉన్నాం : దిల్ రాజు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులను చాలా కాలంగా ఊరిస్తూ వస్తున్న చిత్రం 'ఐకాన్. పుష్ప సినిమాకు ముందు ఈ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ అల్లు అర్జున్‌తో రద్దయినట్లు నిర్మాత దిల్ రాజు ప్రకటించాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌తో వేరే హీరోతో ముందుకు వెళ్తుందని ఆయన వెల్లడిరచారు. 'వకీల్ సాబ్' దర్శకుడు వేణు శ్రీరామ్ అల్లు అర్జున్ కోసం 'ఐకాన్' కథను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అధికారికంగా ఒక పోస్టర్‌ను కూడా వదిలారు.ఔ అయితే, 'పుష్ప' సినిమాతో అల్లు అర్జున్ బిజీ కావడంతో, ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతూ వచ్చింది. ఈ మధ్యలో వేణు శ్రీరామ్ నానితో 'తమ్ముడు' అనే మరో కథను సిద్ధం చేసుకున్నారు. అయితే పుష్ప సినిమాతో అల్లు అర్జున్‌కి వచ్చిన క్రేజ్ కారణంగా ఐకాన్ చిత్రం అల్లు అర్జున్ సెట్ కాదని మేకర్స్ ఆలోచించినట్లు సమాచారం. ఇదే విషయంపై దిల్ రాజు మాట్లాడుతూ.. అల్లు అర్జున్ ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా 'ఐకాన్' సినిమా చేసే అవకాశం లేదు. అందుకే ఈ మూవీ కోసం వేరే హీరోని తీసుకునే ఆలోచనలో ఉన్నాం. 'తమ్ముడు' విడుదలైన తర్వాత వేణు శ్రీరామ్ 'ఐకాన్' స్క్రిప్ట్‌ను ముందుకు తీసుకెళ్తారు. ఇది యూనివర్సల్ స్క్రిప్ట్. హ్యూమన్ ఎమోషన్స్‌తో కూడిన ఒక యాక్షన్ ఫిలిం ఇది'' అని వెల్లడిరచారు.



# జననేత... ఇకలేరు

## ఇక సెలవంటూ.....కన్నీటి వీడ్కోలు

### ఉమ్మడి రాష్ట్ర మాజీ ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడు, ప్రజా నాయకులు రాజారపు ప్రతాప్ కన్నుమూత.



**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ రాజకీయాల్లో చెదరని ముద్ర వేసి, నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా స్థానం సంపాదించిన నాయకుడు,ఉద్యమకారుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాజారపు ప్రతాప్ సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు.కొద్దీ కాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఆయన తుది శ్వాస విడిచారు.వారి మరణ వార్త ఉమ్మడి జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సామాజిక రంగంలో తీవ్ర విషాదం నెలకొంది.కుటుంబ సభ్యులు, అభిమానులను కన్నీటిసంద్రంలో ముంచివేసింది.

చివరి శ్వాస విడిచే వరకు పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన ఆయన, సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. పేదల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడ్డారు. వృద్ధులు, వితంతువుల సమస్యల పట్ల అంకితభావంతో స్పందించే రాజారపు ప్రతాప్ పార్టీలు, పదవులు లెక్క చేయకుండా పని చేశారు.అధికారంలో ఉన్న లేకున్నా ఆపద అంటే ఆదుకునే తత్వం అయన సొంతం. ఒక్కసారి కూడా ప్రజా ప్రతినిధిగా గెలవకున్న నియోజకవర్గ ప్రజల్లో విశ్వాసాన్ని పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

**బహుజనుల రాజకీయ స్ఫూర్తికి ప్రతీక**

నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజారపు ప్రతాప్ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొన్నారు. పేదరికంలో పెరిగినప్పటికి ఆపద ఉందంటే పెద్దన్నగా వ్యవహరించారు. ఎన్నో అవరోధాలు ఎదురుకుని, అంచె లంచెలుగా ఎదిగి ప్రజల మన్నెలు పొందారు.బడుగు బలహీన వర్గాల హక్కులకై నిరంతరం కృషి చేశారు.

**ఉమ్మడి రాష్ట్రంలోనే రాష్ట్ర స్థాయి గుర్తింపు**

నాటి సీఎం వైస్సార్ కు అత్యంత ఆప్తుడుగా మెదిలిన ప్రతాప్, ఉమ్మడి రాష్ట్రంలోనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా సేవలందించి ప్రజల్లో స్థిర స్థానం పొందారు. రెండుసార్లు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన ప్పటికీ ప్రజా సమస్యలపై తన స్థిరమైన నిబద్ధతను చాటారు.

2015లో బిఆర్ఎస్ లో చేరిన అయన తన వంతుగా నియోజకవర్గ అభివృద్ధి కి పాటుపడ్డారు.కెసిఆర్ ప్రభుత్వంలో మైనారిటీ కమిషన్ వైస్ ఛైర్మెన్ గా పదవి వరించినప్పటికీ తృణప్రాయంగా ఒదిలేసారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల్లో ఉండి సేవా చేయాలనే దృఢ సంకల్పంతో చివరి వరకు టికెట్ కోసం ప్రయత్నించారు.చివరికి బిఎస్పీ నుండి పోటీ చేసి ఓడిపోయారు.

**న్యాయం కోసం నిరంతర పోరాటం**

రాజకీయాల్లో మొదటి నుండి పట్టుదలతో, ధైర్యంగా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే నేతగా ఆయన ఎదిగారు. ప్రభుత్వ విధానాలపై విభిన్న దృక్కోణంతో విశ్లేషణ చేసి, సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ముందడుగు వేశారు. ఎస్సి, ఎస్టీ విద్యార్థులకు, నిరుద్యోగ యువత కు విద్య, ఉపాధి రంగాల్లో అవకాశాలను పెంచేందుకు మార్గదర్శకులుగా నిలిచారు.పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం కల్పించడంలో కీలక పాత్ర పోషించారు.


**ప్రతాప్ మృతి సామాజిక రంగానికి తీరని లోటు**

రాజారపు ప్రతాప్ అకాల మరణం పట్ల పలువురు రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన సేవలను స్మరించుకుని దిగ్భ్రాంతికి లోనైయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గౌరవించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆయన స్మృతిలో స్మారక చిహ్నాలు, సేవాధారిత పథకాలను ఏర్పాటు చేయాలని పిలుపునిస్తున్నారు.

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా......**

రెండు దశబ్దాలుగా ప్రజా సేవలో చురుగ్గా ఉండి, ప్రజల మధ్యే గడిపిన ఆయన, అధికారాల కోసం కాకుండా, ప్రజల కోసం పనిచేయడమే రాజకీయమని నిరూపించారు.అంకితభావంతో పని చేసి ప్రజల మద్దతు, అభిమానంతో ఆయన దశాబ్దాలుగా ప్రజానాయకునిగా నిలిచారు.ఎంతో మంది యువతకు రాజకీయ స్ఫూర్తి నింపి ఆదర్శంగా నిలిచారు. న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో ఆయనకున్న ప్రత్యేకత ప్రజల గుండెల్లో స్థిరమైన ముద్ర వేసింది. జీవజ్యోతి, ఫా. కోలోంబో ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేసి మారుమూల గ్రామాల్లో హెల్త్ క్యాంపు పెట్టించి వైద్య సేవలు అందించారు. సంచార జాతులకు కుల గుర్తింపు కోసం ఆయన కృషి మరువలేనిది.







# ప్రజల పక్షాన జీవించిన నేత... ప్రతాప్

- ప్రజల పక్షాన జీవించిన నేత...ఇకలేరు
- మాజీ ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాజారపు ప్రతాప్ కన్నుమూత
- నివాళులు అర్పించిన ప్రముఖులు
- అంతిమయాత్రలో పాల్గొన్న అశేష జనవాహిని



**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోగాజకవర్గానికి చెందిన,దళిత బహుజనుల నాయకుడు,ప్రజల పక్షాన జీవించిన నేత,సీనియర్ రాజకీయ నాయకులు,మాజీ ఎస్సి,ఎస్టీ కమీషన్ మెంబర్ రాజారపు ప్రతాప్ సోమవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు.ఈ వార్తతో ఉమ్మడి జిల్లాలోనే కాదు,రాష్ట్ర వ్యాప్తంగా సామజిక రంగంలో తీవ్ర విషాదం నెలకొంది.ఎప్పుడు పేదోడికి మంచి చేయాలనీ ఆలోచనలతో,బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడే ఒక గొప్ప నాయకుడిని కోల్పోయామంటూ ఆయన అంత్యక్రియలకు వచ్చిన జనం కన్నీటి పర్యంతమయ్యారు.

**నివాళులు అర్పించిన ప్రముఖులు**

రాజారపు ప్రతాప్ పార్థీవ దేహానికి ప్రముఖులు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, బహుజన సమాజానికి తీరనిలాంటి నష్టాన్ని మిగిలించారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి" అని ఆయన సేవలను కొనియాడారు.ప్రతాప్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించిన వారిలో స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి,ఎమ్మెల్సీ,మాజీ శాసన సభ స్పీకర్ మధుసూధన చారి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య,ఆరూరి రమేష్,శంకర్ నాయక్ ,మాజీ ఎంపీ,స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య,పాస్టర్ సంగాల పాల్సన్ రాజ్,మాజీ జెడ్పిటిసిలు,ఎంపిపిలు,సర్పంచ్లు,వివిధ పార్టీల నాయకులు,క్రిస్టియన్ పాస్టర్లు,ఫాదర్ లు,సిస్టర్లు తదితరులు పాల్గొని ప్రతాప్ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



**ముగిసిన అంత్యక్రియలు**

రాజారపు ప్రతాప్ అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. అంతకుముందు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆయన పార్థీవ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఫాతిమానగర్ లోని అయన నివాసంలో ఉంచారు.అనంతరం కరుణాపురం తరలించి చర్చిలో ఫాదర్ సుధాకర్ రెడ్డి నేతృత్వంలో పలువురు ఫాదర్లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.అనంతరం ప్రక్కనే ఉన్న స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# శత్రువును 22 నిమిషాల్లోనే మోకాళ్లపై కూర్చోబెట్టాం


- ఉగ్రవాదంపై భారత్ కఠినమైన విధానాన్ని ప్రపంచానికి స్పష్టం చేసింది
- రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించాం
- సైనిక అవసరాల కోసం విదేశాలపై మనం ఇప్పుడు తక్కువగా ఆధారపడుతున్నాం
- ప్రధాని మోదీ



'ఆపరేషన్ సిందూర్' పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ కఠినమైన విధానాన్ని ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు. ఉగ్రవాదంపై భారత్ దృఢవైఖరిని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందని వ్యాఖ్యానించారు. భారత్‌పై ఉగ్రదాడులను సహించేది లేదన్నారు. ముష్కరులు ఎక్కడ నక్కినా అంతం చేస్తామని మోదీ తీవ్రంగా హెచ్చరించారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. 'భారత్‌పై ఉగ్రదాడులను సహించేది లేదు. మన దేశంపై దాడులకు పాల్పడిన ముష్కరులు ఎక్కడ నక్కినా విడిచిపెట్టం. పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణలో భారతదేశంలో తయారైన ఆయుధాలు తమ ప్రభావాన్ని చూపించాయి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించాం. సైనిక అవసరాల కోసం విదేశాలపై మనం ఇప్పుడు తక్కువగా ఆధారపడుతున్నాం. ఆపరేషన్ సిందూర్‌లో దీని ప్రభావం కనిపించింది. దేశీయంగా తయారైన ఆయుధాలతో 22 నిమిషాల్లోనే పాకిస్థాన్‌ను మన సైన్యం మోకాళ్లపై కూర్చోబెట్టింది. భారతీయుల రక్తాన్ని పారించిన ఉగ్రవాదుల స్థావరాలు ఎక్కడా సురక్షితం కాదని నిరూపించాం' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

# 24 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కంప్లైంట్
- హిమాచల్ ప్రదేశ్‌లో వెలుగుచూసిన ఘటన



విద్యార్థులకుమంచి బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే కీచకుడయ్యాడు. పాఠశాలలోని పలువురు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో వెలుగుచూసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్మౌర్ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారులు 'శిక్ష సంవాద్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కంప్లైంట్ ఇచ్చారు. తమను అసభ్యకరంగా తాకాడంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ప్రిన్సిపల్.. విద్యాశాఖ అధికారులు, లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి పంపారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన విద్యాశాఖ ఉన్నతాధికారులు.. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు. అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, దర్యాప్తులో విద్యార్థుల ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# భారత్-పాక్ క్రికెటర్ల ఆలింగనం..

### కౌంటీ మ్యాచ్‌లో అరుదైన దృశ్యం!

ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో జరుగుతున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. భారత జట్టు వికెట్ కీపర్‌బ్యాటర్ ఇషాన్ కిషన్, పాకిస్థాన్ క్రికెటర్ మొహమ్మద్ అబ్బాస్ కలిసి ఒక వికెట్‌ను సాధించి, మైదానంలో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ దృశ్యానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నడుమ, ఈ సంఘటన క్రీడాస్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. నాటింగ్‌హామ్‌షైర్, యార్క్‌షైర్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్ వేసిన ఒక లెంగ్త్ బంతిని యార్క్‌షైర్ ఓపెనర్ ఆడమ్ లిత్ ఎదుర్కోగా, బంతి బ్యాట్ అంచును తాకింది. వికెట్ల వెనుక ఉన్న ఇషాన్ కిషన్ ఆ క్యాచ్‌ను అందుకున్నాడు. వికెట్ పడిన వెంటనే అబ్బాస్, కిషన్ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ వీడియోను నాటింగ్‌హామ్‌షైర్ తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ''ది పర్ఫెక్ట్ స్టార్ట్!'' అంటూ పంచుకుంది. ఇదే మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ బ్యాట్‌తోనూ అదరగొట్టాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నాటింగ్‌హామ్‌షైర్ తరఫున తన అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇషాన్ కిషన్ అద్భుతమైన అర్ధశతకం సాధించాడు. సోమవారం యార్క్‌షైర్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ డామ్ బెస్, న్యూజిలాండ్ పేసర్ విల్ ఓరూర్కే వంటి అంతర్జాతీయ స్థాయి బౌలర్లున్నప్పటికీ కిషన్ తనదైన దూకుడు శైలిలో బ్యాటింగ్ చేశాడు. కేవలం 98 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేశాడు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో సమాచారం ప్రకారం, ఇషాన్ కిషన్ రెండు కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌ల కోసం నాటింగ్‌హామ్‌షైర్‌తో స్వల్పకాలిక ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో అతను ట్రెంట్ బ్రిడ్జ్‌లో యార్క్‌షైర్‌తో జరుగుతున్న మ్యాచ్‌తో పాటు, టౌంటన్‌లో సోమర్‌సెట్‌తో జరగబోయే మ్యాచ్‌కు కూడా ఆడనున్నాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలిచిన దక్షిణాఫ్రికా ఆటగాడు కైల్ వెర్రెయిన్ జింబాబ్వేతో రెండు టెస్టుల సిరీస్‌లో ఆడుతున్నందున, అతని స్థానంలో కిషన్ జట్టులోకి వచ్చాడు.





# పంత్‌ను తప్పుపట్టిన ఐసీసీ..

## అతని ఖాతాలోకి ఓ డీమెరిట్ పాయింట్

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మూడవ రోజు రిషబ్ పంత్ అంపైర్లతో అనుచితంగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో ఐసీసీ అతనిపై చర్యలు తీసుకున్నది. అంపైర్ల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన కారణంగా.. అంతర్జాతీయ క్రికెట్ మండలి అతన్ని మందలించింది. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలతో చెలరేగిన పంత్.. ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో సరైన రీతిలో ప్రవర్తించలేదని ఐసీసీ తెలిపింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1 నేరానికి పాల్పడినట్లు ఐసీసీ పేర్కొన్నది. అంతర్జాతీయ మ్యాచుల్లో అంపైర్ల పట్ల సరైన ప్రవర్తన కలిగి ఉండకపోవడాన్ని లెవల్ 1 అఫెన్స్‌గా చూస్తారు. ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.8 ఉల్లంఘించినట్లు ఐసీసీ చెప్పింది. క్రమశిక్షణా చర్యల కింద పంత్‌కు ఓ డీమెరిట్ పాయింట్ జోడిరచారు. గడిచిన 24 నెలల్లో అతను తొలిసారి క్రమశిక్షణా కోడ్‌ను ఉల్లంఘించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 61వ ఓవర్‌లో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. బంతి కండీషన్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో పంత్ చర్చించాడు. బాల్‌ను మార్చేందుకు అంపైర్లు నిరాకరించడంతో రిషబ్ పంత్ ఆగ్రహంతో తన చేతుల్లో ఉన్న బంతిని నేలకు కొట్టేశాడు. తప్పును ఒప్పుకొన్ని పంత్.. ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రచర్డ్‌సన్ విధించిన ఆంక్షలను ఆమోదించాడు.

# కేఎల్ రాహుల్ కష్టం చూస్తే మెచ్చుకోకుండా ఉండలేరు!

టీమిండియా స్టైలిష్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫార్మాట్లకు అతీతంగా రాణిస్తున్నాడు. టీ20, వన్డే, టెస్టులు.. ఇలా ఫార్మాట్ ఏదైనా సరే బరిలోకి దిగితే పరుగుల వర్షం కురిపించాల్సిందే అనేలా అతడి బ్యాటింగ్ సాగుతోంది. ఈ ఏడాది ఆరంభంలో చాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన రాహుల్.. ఆ తర్వాత ఐపీఎల్‌లో అదే ఫామ్‌ను కొనసాగించాడు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లోనూ దుమ్మురేపుతున్నాడు. లీడ్స్ టెస్ట్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 137 పరుగులతో భారత బ్యాటింగ్‌ను ముందుండి నడిపించాడు. అతడి సెంచరీకి అంతా ఇంప్రెస్ అవుతున్నారు. వాటే బ్యాటింగ్ అంటూ మెచ్చుకుంటున్నారు. సెంచరీ బాదిన రాహుల్.. వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ (118)తో కలసి నాలుగో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. వీళ్లిద్దరూ రాణించడం వల్లే 364 పరుగులు చేయగలిగింది భారత్. దీంతో రాహుల్‌ను అంతా పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేని లోటు కనపడకుండా చేస్తున్నాడని, అతడి బ్యాటింగ్ అద్భుతమని ప్రశంసిస్తున్నారు. ఈ జోరు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నారు. ఈ తరుణంలో కేఎల్ ప్రాక్టీస్ వీడియో ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. మ్యాచ్‌కు వెళ్లే ముందు సన్నాహకాల్లో రాహుల్ పడిన కష్టాన్ని ఇందులో చూడొచ్చు.



# మాజీ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూత

ముంబై: టీమిండియా మాజీ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూశారు. ఆయన వయసు 77 ఏళ్లు. లండన్‌లో ఆయన గుండె సంబంధిత వ్యాధితో మరణించారు. కొన్ని దశాబ్ధాల నుంచి ఆయన లండన్‌లోనే నివాసం ఉంటున్నారు. టీమిండియా తరపున 33 టెస్టులు ఆడిన దిలీప్.. 114 వికెట్లు తీసుకున్నాడు. అయిదేసి వికెట్లు అతను ఆరు సార్లు తీసుకున్నాడు. 15 వన్డేల్లో అతను 22 వికెట్లు తీసుకున్నాడు. సౌరాష్ట్ర, బెంగాల్, వార్‌విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్‌కు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. 1970 దశకంలో ఉన్న మేటి స్పిన్నర్ల దారిలో దిలీప్ దోషి ముందుకు సాగాడు. అతను 32 ఏళ్ల వయసులో టెస్టు అరంగేట్రం చేశాడు. నాటింగ్‌హామ్‌షైర్‌లో లెజండరీ గ్యారీఫీల్డ్ సోబర్స్‌తో కలిసి ఆడేవాడు. 1980 దశకంలో అతను స్వల్ప సమయంలోనే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఆ దశలో ఇండియన్ క్రికెట్ నడుస్తున్న తీరును ఆయన ఇష్టపడలేదు. స్పిన్ పంచ్ పేరుతో ఆటోబయోగ్రఫీ బుక్ రాశాడతను. దాంట్లో క్రికెట్ అనుభవాల గురించి చెప్పాడు.



# కౌంటీల్లో దుమ్మురేపిన తెలుగోడు..

### గుర్తుండిపోయే నాక్!

భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ కౌంటీల్లో అదరగొడుతున్నాడు. అరంగేట్రంలోనే క్లాసికల్ ఇన్నింగ్స్‌తో అందర్నీ ఆకట్టుకున్నాడు. హ్యాంప్‌షైర్ తరపున బరిలోకి దిగిన ఈ హైదరాబాదీ బ్యాటర్.. 234 బంతుల్లో 98 పరుగులు బాదాడు. ఇందులో 11 బౌండరీలు, 3 భారీ సిక్సులు ఉన్నాయి. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ ఓ చేయి వేశాడు తిలక్. వికెట్ తీయకపోయినా 2 ఓవర్లలో 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. హ్యాంప్‌షైర్ ఇన్నింగ్స్‌లో తిలక్ బ్యాటింగ్ హైలైట్‌గా నిలిచింది. సాలిడ్ డిఫెన్స్‌తో ఒకవైపు వికెట్ కాపాడుకుంటూనే.. మరోవైపు స్ట్రైక్ రొటేషన్ చేయడం, వీలు చిక్కినప్పడల్లా ఫోర్లు, సిక్సులు బాదడం అభిమానులను ఆకట్టుకుంది. కౌంటీల్లో రాణించడం అంత ఈజీ కాదు. పేస్‌కు సహకరించే పిచ్‌లపై పరుగులు చేయడంలో తోపు బ్యాటర్లు కూడా తడబడుతుంటారు. అలాంటి చోట తిలక్ ధైర్యంగా బ్యాటింగ్ చేశాడు. హ్యాంప్‌షైర్ 34 పరుగులకు 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్.. నింపాదిగా, టెన్షన్ పడకుండా బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థి బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో ఇబ్బందులు పెట్టినా.. అతడు మాత్రం కూల్‌గా తన పని తాను చేసుకుంటూ పోయాడు. ఒత్తిడిని తన మీద నుంచి అవతలి జట్టు పైకి నెట్టాడు. ఈ ఇన్నింగ్స్ చూసిన నెటిజన్స్.. సెలెక్టర్లకు తిలక్ పరీక్ష పెడుతున్నాడని అంటున్నారు. అతడు ఇలాగే ఆడుతూ పోతే భారత టెస్ట్ జట్టులోకి తెలుగోడ్ని తీసుకోవడం తప్పితే సెలెక్టర్లకు ఇంకో ఆప్షన్ లేదని కామెంట్స్ చేస్తున్నారు. త్వరలోనే తిలక్ టీమిండియాలోకి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెబుతున్నారు.





# సరికొత్త చరిత్ర లిఖించేదెవరో?

లీడ్స్ టెస్ట్‌లో నేడు నిర్ణయాత్మక రోజు. భారత్ గెలుస్తుందా లేదా ఇంగ్లాండ్%ా% అనేది ఐదవ రోజు ఆటలో తేలనుంది. భారత జట్టు ఇచ్చిన 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ జట్టు నాల్గవ రోజు ఆట ముగిసే వరకు తమ రెండవ ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 21 పరుగులు చేసింది. ఇప్పుడు టెస్ట్ మ్యాచ్ చివరి రోజు. ఇంకా 350 పరుగులు చేయాలి, చేతిలో 10 వికెట్లు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితిలో, ఎవరు గెలుస్తారనేదిగా ప్రశ్నగా మారింది? ఇంగ్లాండ్ ఈ లక్ష్యాన్ని సాధిస్తే, స్వదేశంలో రెండవ అతిపెద్ద ఛేజింగ్ అవుతుంది. అలాగే, లీడ్స్ మైదానంలో ఇది రెండవ అతి పెద్ద ఛేజింగ్ అవుతుంది. కానీ, ఇంగ్లాండ్‌కు ఇది అంత సులభం అవుతుందా, లేదా అనేది చూడాల్సి ఉంది.

భారత్‌ఇంగ్లాండ్ ట్రాక్ రికార్డ్..

ఇంగ్లాండ్‌కు పరిస్థితులు తేలికగా ఉంటాయా లేదా అనేది దాని సొంత ట్రాక్ రికార్డ్, ప్రస్తుత ప్రదర్శన, అలాగే టీమిండియా గత ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది. టీం ఇండియా గురించి చెప్పాలంటే, టెస్ట్ క్రికెట్‌లో 350 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు డిఫెండ్ చేస్తూ ఒకే ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయింది. ఇప్పటివరకు భారత్ 59 టెస్టులు ఆడి 350 కంటే ఎక్కువ పరుగులు డిఫెండ్ చేసుకుంది. ఆ 59 టెస్టుల్లో 42 గెలిచింది, 1 మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది. అదే సమయంలో 16 టెస్టులు డ్రా అయ్యాయి. ఇప్పుడు, ఇంగ్లాండ్ వైఖరిని చూస్తే, చేతిలో 10 వికెట్లు, పూర్తి రోజు ఆట మిగిలి ఉంది. ఇంగ్లాండ్ మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో బరిలోకి దిగడం కష్టమే. అలా చేయకపోతే, మ్యాచ్ ఖచ్చితంగా ఒక ముగింపునకు చేరుకుంటుంది. 350 కంటే ఎక్కువ పరుగులను కాపాడుకోవడం ద్వారా భారత్ తన 43వ విజయాన్ని సాధిస్తుందా లేదా ఓటమిని ఎదుర్కొంటుందా అనేది కొద్దిసేపట్లో తేలిసిపోతుంది. లేదా బెన్ స్టోక్స్ నాయకత్వంలో ఇంగ్లాండ్‌కు ఇలాంటి కథే లిఖించనుందో లేదో చూడాలి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in